# అర్థంకాని కన్నీరు

సూరి ఇంట్లోకి బాణంలా దూసుకు వచ్చాడు. అతని మొహం మబ్బులేని ఆకాశంలా నిర్మలంగావుంది. లిన్నగా వస్తున్నవాడు లెగ్ బ్రేకులా ఎడమపక్కకు తిరిగి కిటికీదగ్గరకూర్చున్న ముసలమ్మదగ్గర కూర్చున్నాడు. ముసలమ్మ జీవితాన్ని జీర్ణించుకున్న కళ్ళతో నవ్వింది. పూర్తిగా వార్థక్యంకప్పేసుకుపోయినా తోడేలాగ తలూపుతోంది నెమ్మదిగా. కళ్ళజోళ్ళోంచి మనవణ్ణి చూసింది. కుడుతున్న పంచెను అట్టేవుంచి "ఏరా సూరీ!...నీ మొహం పున్నమిలా వుందేరా!... అప్పుడే చక్కా వచ్చేశావు?...రోడ్డుమీది ఇసికంతా ఐపోయిందా?" అనడిగి నవ్వింది. కళ్ళను కప్పేస్తున్న జుట్టును వోచేత్తో తోసుకుంటూ సూరి అన్నాడు: "మరేం!...రామంగాడి తాతయ్యొచ్చాడు...భలేపిలకా అదీ వుంది. వాడికి పళ్ళవీ పట్టుకొచ్చాడు. ఎవరూ ఆడుకోటానికి రాలేదు- అందుకని వచ్చేశాను. అది సరేగాని మన తాతయ్యెప్పుడొస్తాడు మామ్మా?...కాశీ వెళ్ళాడన్నావు- అతను దొంగతాతలాగున్నాడే?"

కథానిక

ముసలమ్మ మొహం పాలిపోయింది. కళ్ళల్లోంచి జలాశయాలు తొంగిచూచాయి. సూరి జవాబు కోసం నోరుతెరచి అలాగే కూర్చున్నాడు.

"వస్తాడులే - మరి వెళ్ళిన పనవద్దూ?" అంది. ఆ మాటల్లో వండ్లగింజెత్తు నిజంకూడా లేదన్నట్టు చూస్తూ "అందరికీ తాతయ్యలున్నారు...మంచి కతలు చెప్తారు-మరి మనతాతయ్య సీతక్కయ్యలా వుత్తరాలన్నా రాయడే!"

"కాశీనుంచి రాసినా వుత్తరాలందుతాయటు కదూ?" అన్నాడు సూరి.

"ఎందుకు రాయడు?...రాస్తుంటాడు. నువ్వు చూళ్ళేదులే!"

"అంతా ఒట్టిది. నువ్వన్నీ అబద్ధాలు చెప్తున్నావు. నాకన్నీ తెలుసు రామంగాడికి వాళ్ళ అమ్మ అంతా చెప్పింద"ట అంటూ నవ్వాడు.

ముసలమ్మ ఖంగారుపడుతూ కళ్ళజోళ్ళోంచి మనవణ్ణి విమర్శగా చూస్తూ "ఏవన్నాడేవిటి?" అనడిగింది.

సూరి చుట్టూ భయంగా చూసి "తాతయ్య చచ్చిపోయాట్ట. అంతా ఊరికే అంటున్నావని వాళ్ళమ్మ అందిట. తాతయ్య పారిపోయాట్ట కదూ? నాన్న కొట్టాడేమో! నాన్నకస్తమానం కోపమే!" అన్నాడు.

"నోరుముయ్యరా వెధవా! అతివాగుడెక్కువైపోయింది" అని వంటింట్లోంచి అనసూయ కేకేసింది.

"ఊరుకుందూ! వాడికేం తెలుసు? పోయి ఆడుకోరా. రామం అన్నదంతా ఒట్టిది. మీ తాతయ్య తప్పకుండా వస్తాడులే- వెళ్లు" అనేసి ముసలమ్మ కళ్ళు అటుతిప్పుకుంది.

"అమ్మమ్మా! ఏడుస్తున్నావెందుకే?" అనడిగాడు సూర్యరశ్మిలో మెరుస్తున్న కన్నీటిచుక్కల్ని చూస్తూ. అమ్మమ్మ అస్తమానం ఎందుకేడుస్తుందో బుర్ర బద్దలుకొట్టుకున్నా సూరికర్థం కావటంలేదు. అదీకాక కాశీపోయిన తాతయ్య గురించి అడిగినా మాట్లాడినా ఏడుస్తుంది- ఒట్టి వెర్రిదనుకున్నాడు.

"ఏంలేదురా! వేడిచేసిందంతే!" అంది.

తాతయ్య చచ్చిపోయాడని అనుంటే ఇంత బాధవుండేదికాదని మొదటిసారిగా అనుకుంది ముసలమ్మ. ఆ మాటలు సమ్మెటపోటులా వున్నాయి. నిజం ఎలావున్నా తనుమాత్రం ఆ మాటన లేకపోయింది. ఇంత చిన్న విషయానికి తనని మనవడు రాచి రంపాన పెడతాడని ముసలమ్మ అనుకోలేదు. తాతయ్యనుగురించి అడిగినప్పుడు కాశీకి వెళ్ళాడనిమాత్రం అని వూరుకుంది. ఆ ప్రశ్నయినా సూరి స్వయంగా అడగలేదు. ఎవరో పెద్దలు పురెక్కిస్తే తెలుపునలుపులు తెలియక అడిగాడు. అదింతవరకు తీసుకొచ్చింది.

ఆర్. యం. చిదంబరం

సూరి అనసూయ కేక కదిలిపడి బయట కెళ్ళిపోయాడు. కాని మనసులో మరో సందేహం పీకుతోంది. ముసలమ్మ దమ్మిడీయంత బొట్టు పెట్టుకుంటోంది కనక తాతయ్య బతికున్నాడని ఎవరో అన్నారు. అడుగుదామనుకున్నాడు.

అరగంటపోయాక స్కూలునుంచి జగన్నాథం వచ్చాడు. అనసూయ అందించిన కాఫీ తాగుతూ పక్షపాతంలేకుండా కాఫీమీదున్న అభిమానంలాంటిదే ఆమెమీదకూడా ఒలకబోస్తూ చూస్తూ "ఓ కొత్త సంగతి-కనకాపురంనుంచి ఓ స్వాములవారు వస్తున్నారు. రామమందిరంలో సప్తాహాలు జగుతాయట-మీ అమ్మ కిలాంటి విష్టంగా చెప్పు-వెడుతుందేమో!" అని గట్టిగా ముసలమ్మకు వినిపించేట్టన్నాడు.

"అలాగా బాబూ!...తప్పకుండా వెళ్ళాలి. పొద్దున్న ఎవరో నువ్వన్నమాటే అన్నారు లే-"

ముసలమ్మ మాట పూర్తి చేయకుండానే అంగదుడిలా సూరి పరుగెత్తుకొచ్చాడు.

"అమ్మా!...చత్తాహానికి నేనూ వెడతానే!" అన్నాడు అనసూయ దగ్గరికి చేరి.

"నువ్వెందుకురా?...అక్కడకెళ్లి నానా అల్లరీ చేస్తావు-లేకపోతే నిద్రపోతావు" అని కసురుకుంది అనసూయ.

సూరి దివాలాతీసిన మొహంపెట్టాడు.

"అబ్బే! ఏం అల్లరిచెయ్యనే! అన్నీ వింటానే! నే వెడతానే!"

"వెళ్ళరా బాబూ! రాత్రి పదింటిదాకా నన్నా నీపోరు తగ్గుతుంది" అన్నాడు జగన్నాథం.

ఏడుగంటలయింది. చీకటి పొడి ఇసుకలో నీళ్ళలా పాకిపోయి కప్పేసింది. దూరంగా నాదస్వరం వినిపిస్తోంది. సన్నాయి సంగీతం కర్తలకు మధురంగావున్నా కొందరు వినలేక చెవులు మూసుకున్నారు.

"అమ్మమ్మా! సాములవారొస్తున్నారే!" అనరిచాడు సూరి. ముసలమ్మ బైటకొచ్చింది.

సన్నాయిమేళం దగ్గరకొచ్చేసింది. కాషాయి గుడ్డల్లో దాక్కుంది వర్చస్సు. కళ్ళల్లో మెరుస్తున్న కాంతి. నడుస్తున్నాడు సన్యాసి. చుట్టూ జనం భజన చేసుకుంటూ కదులుతున్నారు. కర్రచెప్పుల కుదుపులకి భూమి కంపిస్తోంది. ముసలమ్మ స్వాములవారిని చూపించి. అనసూయా చూసింది. జగన్నాథం చూశాడు.

ముసలమ్మ కళ్ళల్లో నీరు నిండింది గ్యాసు లైట్ల కాంతిలో దాన్ని బాగా గమనించింది సూరి. అమ్మమ్మ ఎందుకేడుస్తోందో అర్థంకాక అలా చూస్తూ నిలబడ్డాడు. స్వాములవారు ఒక్కసారి కన్నెత్తి ముసలమ్మను చూశారు. సూరి ఇంటిదగ్గరకొచ్చేశారు. ముసలమ్మ గబగబా మెట్లు దిగి దగ్గరగా నిలబడి స్వాములవారిని చూసింది.

సూరిగాడికి పూర్తిగా మతిపోయినట్టయింది. ఇదంతా ఆశ్చర్యంగా చూస్తూన్న అనసూయ జగన్నాథంతో "అంతేనేమో! లేకపోతే అమ్మ ఎందుకేడుతుంది?" అంది. జగన్నాథం తల నిలువునా ఆడించాడు.

"అమ్మమ్మా! ఆ స్వాములవారి నెందుకలా చూశావు?" అనడిగాడు సూరి.

ముసలమ్మ ఐదు నిమిషాలు బిత్తరపోయిచూసి "ఆ మరేంలేదు. ఆయన్ని చూడగానే అలా గనిపించింది. అంతే." అంది. క్లాసులో బండ భాగారాలైనా అర్థమవుతాయికాని ఇదర్థమవదనుకున్నాడు సూరి. అతనికంతా అయోమయంగా వుంది. ఏదో తనకి తెలియకుండా అందరూకలిసి దాస్తున్నారనిమాత్రం ఇట్టే పసికట్టాడు. అమ్మకేసీ, అమ్మమ్మకేసీ దృక్కులు సారించి మార్చి చూశాడు. అమ్మమ్మ కళ్ళల్లో మళ్ళీ కన్నీరు!

తల్లి కన్నీటిలో అర్థాన్ని గ్రహించుకున్న అనసూయ ఆమెనేమీ ప్రశ్నించలేదు. మాట్లాడకుండా లోపలి కెళ్ళిపోయింది. జగన్నాథం తల్లీ కూతుళ్ళ మూగసంభాషణ అర్థంకాక మెదలకుండా వూరుకున్నాడు. సూరి పళ్లు పటపట కొరుకుతూ అమ్మమ్మకేసి చూశాడు.

ఆ రాత్రి ముసలమ్మ ఆశ్రమానికి వెళ్ళలేదు. సూరికి కొండంత నిరాశ కలిగినా రేపు వెళ్ళొచ్చని తృప్తిపడ్డాడు. మర్నాడు సూరిని వెంటబెట్టుకుని ముసలమ్మ మందిరాని కెళ్ళింది. అప్పటికి జనం బాగా వస్తున్నారు.

"అమ్మమ్మా! ... ముందు కూచుందాం ... చోటుంది. రావే!" అన్నాడు సూరి.

"ముందొద్దురా వెనకాలే కూర్చుందాం."

"దగ్గరుంటే బాగా వినిపిస్తుందే-వెనకాలుంటే

నీకేం వినిపించదు."

కాని ముసలమ్మ ఒప్పుకోలేదు. చివర్నే కూర్చుంది. అమ్మమ్మ కళ్ళల్లో నీరు లేనందుకు సంతోషించాడు సూరి. ముసలమ్మ కూడా తను అసందర్భంగా ఏడవటం మంచిదికాదనిపించింది. మొగుడికి హఠాత్తుగా పారమార్థిక చింతకలిగి దేశంమీదికి పోతే తనను కూతురు ఆదరించింది. అల్లుడు కూడా తల్లిలా చూస్తున్నాడు. తను ఏడవాల్సిన అవుసరమేముంది? ముందు కూర్చోనందుకు సూరికి కోపంగానే వుంది-అందరూ ముందు చోటు కావాలని ఎగబడతారు. అమ్మమ్మకు మతిలేదని తీర్మానించుకున్నాడు. ఆమె మనసు-భావాలు-అన్నీ పిచ్చిపిచ్చిగా వుంటున్నాయ్. ఊరందరిదీ ఓదారకైతే పులిపికట్టైదో గారి.

జనం బాగా వచ్చారు. అంతా నిండాక కాని స్వాములవారు వేదికమీద కూర్చోలేదు. ముసలమ్మ స్వాములవారిని తిన్నగా చూడలేక పోయింది. సూరికనుమానం కలిగి ఆమె కేసి చూశాడు. ఎలక్ట్రిక్ దీపంలో మెరుస్తున్న కన్నీరు! సూరిగాడికి కోపమెక్కువై పోయింది.

"ఆ స్తమానం అలా ఏడుస్తావెందుకమ్మా!" అనరిచాడు. సమాధానం రాలేదు.

మర్నాడు సాయంత్రం— సూరి బంతిలా గెంతుతూ వచ్చాడు.

"అమ్మమ్మా!...ఆ సాములవారు ఎంతమంచి వారనుకున్నావు?" అన్నాడు.

ముసలమ్మ అర్థంకానట్టు చూసింది.

"నేను సాయంత్రం మందిరానికెళ్ళా నే-సాములవారు నన్ను పిలిచి నువ్వెవరబ్బాయన్నారు. జగన్నాతంగా రబ్బాయన్నాను. మీ ఇల్లు యాజులుగారి వీధిలో కదూ- అంటే అవునన్నాను. ఆ పళ్ళెంలోవున్న అరిటిపళ్ళు- ద్రాక్షపళ్ళు నా చేతిలో పెట్టారే- రోజూ రమ్మన్నారు... ఎంత మంచివారనుకున్నావ్?" సూరి ముసలమ్మ కేసి పరీక్షగా చూశాడు. రెండుకళ్ళల్లోనూ రెండు నీటిచుక్కలు.

---

# కిర్మీరోహలు

జీవకళల బరువులకే
వంగిన కనురెప్పలలో
నల్లని కాటుకముద్దల
కాంతిసుధలు చిదిలే
నిశాదేవి నిద్రాభారం
మోసిమోసి శయనించిన
మేఘాంఘునహృద్వీణా
తంత్రులపై మధుర
సుస్వరాలు చిలికించగ—

నయనసిక్త అశ్రుఝురీ
భారంతో కుంగి కృంగి
అంగార స్రోతస్వినీత
రంగాలలోన కదలిపోవు
నిశీధినీ పాదశింజినీ
మధుర శబ్ద తంత్రినీ
స్వనాలు వినగ—
వినీల స్వప్నవీధి తేట
జలదాంగన గుండెల్లో
చిత్రితత విచిత్రచిత్ర
ఊహాచిత్రాలను
తిలకించగ—

కిర్మీరప్రభా రేఖలతో
కళా కాంతి లేఖినితో
చిత్రించిన, మధురస్వప్న
వాటికలో విహరించే
తరుణ మృత్యుభామినీ
మధురాధర పియూషం
గ్రోలుటకై వేచివేచి
నిదురించిన కళాజీవి
హృద్వేదికపై నటించే
క్షితిజ శింజనిక్షణనం
వినాలనే కాంక్షతోడ
పరుగెత్తు విద్యుల్లేఖా
సగ్నిక కటిపై బార్చితి
నా కిర్మీరప్రభా
ఊహాంబరాలు.

—మాదిరాజు రంగారావు.